యుగ గణన ఆరంభమైన దినము

యుగాది (ఉగాది)

"యుగాది" అనే పదమే కాలాంతరంలో 'ఉగాది'గా ప్రచలితమయ్యింది. యుగాది అంటే యుగములకు ఆది – యుగ గణన ఆరంభమైన దినం. యుగము అంటే కొన్ని సంవత్సరాల కలయికతో ఏర్పడినదని అర్థం. మన భూమి ఒక పర్యాయం సూర్యుని చుట్టూ తిరిగి వచ్చుటకు పట్టే కాలాన్ని – **365 1/4 దినములను** సంవత్సరమన్నారు. భారతీయ జ్యోతిషశాస్త్రంలో యుగములు నాలుగు. అవి :

1) కృతయుగం (సత్యయుగం) దీని పరిమాణం – **17,28,000 సంవత్సరాలు**

2) త్రేతాయుగం – **12,96,000 సంవత్సరాలు**

3) ద్వాపరయుగం – **8,64,000 సంవత్సరాలు**

4) కలియుగం – **4,32,000 సంవత్సరాలు**

ఈ నాలుగు యుగములు కలిసిన దానిని చతుర్యుగ మంటారు. దాని పరిమాణం **43,20,000** సంవత్సరాలు. ఇట్టి చతుర్యుగాలు **1000 (వెయ్యి)** కలిస్తే ఒక సృష్టికాలవౌతుంది. అంటే ఒక సృష్టిలో 432 కోట్ల సంవత్సరాలుంటాయి. అనంతరం ప్రలయం ప్రారంభమౌతుంది. దాని పరిమాణం కూడా సృష్టికాలమంతే – **432 కోట్ల** సంవత్సరాలు. సృష్టి ప్రలయాలు దినరాత్రులవలె చక్రభ్రమణంగా వస్తూనే ఉంటాయి.

మన భారతీయ ఋషులు కాలాన్ని గణించడానికి రెండు ప్రాకృతిక పద్ధతుల నేర్పరచుకున్నారు. అవి (1) సూర్యమానము (2) చాంద్రమానము. సూర్యమానం సూర్యుని నడకను అనుసరిస్తూ లెక్కించేది. చాంద్రమాణం చంద్రుని నడక ననుసరించి గణించేది. ఈ రెండు పద్ధతులలోనూ కాంతివృత్తాన్ని ఆధారంగా చేసుకుంటారు. కాంతి వృత్తమంటే మన భూమిచుట్టూ ఉండే నక్షత్రాల వలయం. దీనిని ఖగోళ వృత్తమనియూ అనవచ్చును. గణిత శాస్త్రాన్ననుసరించి వృత్తంలో

360 డిగ్రీలు (అంశములు) ఉంటాయి. అట్లే నక్షత్రాలతో ఏర్పడిన కాంతి వృత్తంలోనూ 360 డిగ్రీలు (అంశములు) ఉంటాయి. అయినప్పటికి గణన సౌలభ్యం కొరకు ఆ వృత్తాన్ని 27 భాగాలుగా చేసి వాటికి నక్షత్రాలని పేరు పెట్టారు. వాటికి విడివిడిగా పెట్టారు. అట్లని ఒక నక్షత్ర భాగంలో ఒకే నక్షత్రముండదు. 2, 3, 4, 6 ఈవిధంగా ఎన్నైనా నక్షత్రాలుండవచ్చు. అయినప్పటికినీ ఒక నక్షత్రంగానే వ్యవహరిస్తారు.

సూర్యమానం

ఈ పద్ధతి ననుసరించి గణించేవారు కాంతి వృత్తంలో (ఖగోళ వలయంలో) ఏ నక్షత్ర భాగంలో సూర్యుడు ఉంటాడో ఆ కాలాభాగానికి ఆ నక్షత్రం పేరుతో కార్తెలని పేరు పెట్టారు. ఉదా: అశ్వినీ కార్తె, భరణి కార్తె, కృత్తికా కార్తె మొదలగునవి. ఈ కాలం 10 నుండి 15 దినముల పరిమాణంలో ఉంటుంది. ఇంతేకాక, వీరు కాంతివృత్తాన్ని 12 భాగాలుగా చేసి వాటికి రాశులని పేరుపెట్టారు. వాటికి విడివిడిగా మేషరాశి, వృషభరాశి, మిధునరాశి మొ॥ పేర్లు పెట్టారు. అంటే 2 1/4 నక్షత్రాల భాగం కలిసి ఒక రాశి అవుతుందన్నమాట. వీరు ఈ 12 రాశులనే 12 నెలలుగా వ్యవహరించారు. కాని, ప్రచండ సూర్యప్రకాశంలో నక్షత్రాలు, కాంతివలయం కనబడవు గనుక ఈ గణన సామాన్య ప్రజలకు అర్థం కాదు. అందుచే అందరికి అర్థమయ్యే చాంద్రమాణాన్ని రూపొందించవలసి వచ్చింది.

చాంద్రమానం

చాంద్రమాన గణనను తెలిసికోవటం చాలా తేలిక. రాత్రివేళ ఖగోళ వలయంలో కనబడే ప్రకాశవంతమైన నక్షత్రాలను గుర్తుపెట్టుకుంటే చంద్రుడు ఏ నక్షత్ర భాగంలో ఉన్నాడో చెప్పవచ్చు. లేదా పంచాంగం చూసి ఆ దినం నక్షత్రం ఏమిటో తెలిసికొని రాత్రి చంద్రుని వద్ద ఉండే నక్షత్రాలను పరిశీలించి అవి ఆ పేరుగల నక్షత్రాలని గ్రహించవచ్చు. క్రమంగా అలవాటు చేసుకుంటే పండిత పామరులందరు ప్రత్యక్ష నిదర్శనంతో వాటిని తెలుసుకోవచ్చు. ఈ చాంద్రమాన గణన ననుసరించేవారు 12 నెలలను ఏర్పాటు చేశారు. పౌర్ణమి దినమున చంద్రుడు ఏ నక్షత్ర భాగంలో ఉంటే ఆ నెలకంతకు (ముందు వచ్చిన శుక్ల పక్షానికి, తదుపరి వచ్చే కృష్ణ పక్షానికి కలిపి) ఆ నక్షత్ర నామంతో పేరు పెట్టారు. ఎట్లంటే పౌర్ణమి రోజున చంద్రుడు చిత్తా నక్షత్ర భాగంలో ఉంటే అది చైత్ర మాసమని, విశాఖ నక్షత్ర భాగంలో ఉంటే వైశాఖ మాసమని ఈవిధంగా

12 నెలలేర్పడ్డాయి. అయితే ఈ మాసముల పరిమాణం 29 దినములే కావటంవల్ల సంవత్సరానికి సుమారుగా 11 దినములు తక్కువవుతాయి. అందుచే వీరు 2 1/2 సంవత్సరాల కొకసారి ఒక నెలను అధిక మాసంగా లెక్కించి సూర్యమానంతో కలుపుతారు.

అశ్వని, భరణి, కృత్తిక, రోహిణి మొదలైన 27 పేర్లు మన ఆది ఋషులు కాలగణన నేవిధంగా ఆరంభించారో మన ప్రాచీన జ్యోతిష గ్రంథాలలో వ్రాసి ఉంది. ప్రసిద్ధ 'హేమాద్రి' గ్రంథంలో.....

శ్లో॥ చైత్రే మాసి జగద్ బ్రహ్మా, ససర్జ ప్రథమేఽహని ।
శుక్లపక్షే సమగ్రస్తు, తదా సూర్యోదయే సతి ॥

భావార్థం : చైత్రమాస శుక్లపక్ష ప్రథమ దినమున సూర్యోదయ సమయంలో బ్రహ్మ (పరమేశ్వరుడు) జగత్ రచన (ప్రాణిసృష్టి) చేశాడు.

ప్రసిద్ధ జ్యోతిషాచార్యులు శ్రీ భాస్కరాచార్య రచిత 'సూర్యసిద్ధాన్త శిరోమణి' అనే గ్రంథంలో మరికొంత వివరంగా చెప్పబడింది.

శ్లో॥ లంకా నగర్యాముదయాచ్చ భానోస్తస్యైవ వారం ప్రథమం బభూవ ।
మధోః సితాదేర్దిన మాస వర్ష యుగాదికానాం యుగపత్ ప్రవృత్తిః ॥

భావార్థం : లంకా నగరంలో సూర్యోదయ సమయము నుండి అదే వారమున అనగా రవివారమున చైత్ర శుక్లపక్ష ఆరంభ దినం నుండి దిన, వార, మాస, వర్షముల (సంవత్సరముల) గణన ఆరంభింపబడెను.

పై రెండు శ్లోకాలలో చైత్ర శుక్ల పాడ్యమి నుండి కాలగణన ఆరంభింపబడినట్లున్నది. క్రింది శ్లోకంలోని లంకా నగరం ఇప్పటి శ్రీలంక కాదు. భూమి ఏర్పడిన ప్రారంభంలో ఉత్తరార్ధ గోళంలో ఒక అతిపెద్ద ద్వీపముండేది. దానికి జంబూ ద్వీపమని పేరు. అందులోనిదే మన భారతదేశం. ఇది అప్పుడు భూమధ్యరేఖ వరకు విస్తరించి ఉండేది. అట్టి విస్తరించి యుండెడి భారతదేశంలో సరిగా భూమధ్యరేఖపైన నేటి గ్రీనిచ్ పట్టణమువలె లంకానగర ముండేది. ఆ నగరాన్ని ఒక కేంద్రంగా చేసుకొని అక్కడినుండి అక్షాంశ రేఖాంశాల నేర్పరచుకొని దేశాలను పట్టణాలను గుర్తించేవారు. సూర్యోదయాది వేళలు కూడా దానినిబట్టే గణించేవారు. జంబూద్వీపాది వివరాలు తెలిసికొనగోరువారు నా రచన 'మన ఇతిహాసం' చదువ గోరుచున్నాను.

చైత్ర శుక్ల పాడ్యమి నుండి కాలగణన ప్రారంభమైనదని చాంద్రమానం

చెప్పుచున్నట్లే, సూర్యుడు మేషరాశిలో ప్రవేశించినప్పటి నుండి కాలగణన ప్రారంభమైనట్లు సూర్యమానం చెబుతుంది. అయితే ఈ గణన ప్రారంభమై 197 కోట్ల సంవత్సరాలకు పైగా కావటంవల్లనూ, సూర్యచంద్రుల నడకలలో (గమన వేగాలలో) వ్యత్యాసాలుండుట వల్లనూ ఈ రెండు తిథులు ఒకే దినమున వచ్చుట లేదు. సూర్యమాన సంవత్సరాది అంటే మేష సంక్రమణం ఇప్పుడు ఏప్రిల్ నెలలో 13 లేదా 14వ తేదీన వచ్చుచున్నది. అందుచే సూర్యమానాన్ననుసరించే తమిళు లు మొదలగు కొన్ని ప్రాంతాలవారు మేష సంక్రమణాన్నే సంవత్సరాది పండుగగా జరుపుకుంటున్నారు. అశ్విన్యాది కార్తెలు, ఉత్తరాయణ దక్షిణాయనాలు సూర్యుని నడకనుబట్టే వస్తాయి. ఋతువులు కూడా సూర్యమానాన్ననుసరించే నిర్ణయించుకోవాలని కొందరు జ్యోతిషవేత్త లంటారు.

ఋతువులలో వసంత ఋతువు మనోహరంగా ఉంటుంది. ఎక్కువ చలిగాని వేడిగాని ఉండక సమశీతోష్ణంగా ఉంటుంది. వాతావరణంలో ఎక్కువ పొడిగాని తేమగాని లేక అన్ని శరీర తత్త్వాలకు అనుకూలంగా ఉంటుంది. ప్రకృతిలో చెట్లు చిగిర్చి పుష్పించటంవల్ల ప్రకృతి కన్నుల పండుగగా ఉంటుంది. దానిని చూసి పశుపక్ష్యాదులు కిలకిలా రావాలు చేస్తాయి. క్రొత్త మావిచివురు తిని కోయిలలు పులకించి కూతలు కూస్తాయి. అవి మనకు వీనులవిందును కలిగిస్తాయి. ఈ విధంగా సృష్టిలోని ఈ క్రొత్తదనం మన ఇంద్రియ మనోబుద్ధులకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. అందుచేతనే కవులు ఋతువులకు రాజు **వసంత ఋతువన్నారు.** ప్రకృతిలో ఈ క్రొత్తదనం నూతన సంవత్సరారంభానికి నిదర్శనంగా నిలుస్తున్నది. క్రొత్త సంవత్సరం ప్రారంభమైనట్లు ప్రకృతి సాక్ష్యమిస్తున్నది. ఆంగ్ల సంవత్సరాది జనవరి 1లో ఈ నిదర్శనాలేవీ కానరావు.

ఈ శ్రీ మన్మథ నామ సంవత్సర చైత్ర శుక్ల పాడ్యమి నాటికి సృష్టికి **197,29,49,115** సంవత్సరాలు పూర్తవుతాయి. 116వ సంవత్సరం ప్రారంభమౌతుంది. (ఇది మన్వంతరాల మధ్య ఉండే సంధికాలాలను కూడా కలిపి చెప్పిన గణన.) విక్రమ శకం ప్రకారం 2071 సంవత్సరాలు పూర్తయ్యి 2072 సంవత్సరంలో ప్రవేశిస్తుంది.

యుగాది కాలగణన ఆరంభించిన దినమే కాక ఆదిమానవ సృష్టి యుగాది దినముననే జరిగిందనీ; అగ్ని, వాయు, ఆదిత్య, అంగిర నామక ఋషుల

హృదయాలలో ఈశ్వరీయ జ్ఞానమైన వేదాలు ప్రకాశింపబడినది కూడా యుగాదినాడేననీ విద్వాంసులంటారు. ఆ విషయాలు మనకు స్పష్టంగా తెలియకపోయినా మహర్షి దయానంద సరస్వతి గారు ఆర్య సమాజాన్ని స్థాపించినది మాత్రం యుగాది దినముననే. కనుక అది ఆర్యసమాజ స్థాపనా దినం కూడా.

197 కోట్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన మన వేదమతం కాలప్రవాహంలో అనేకానేక ఒడిదుడుకులకు గురి అయ్యింది. ముఖ్యంగా విదేశీయులు విమతస్థులైన మహమ్మదీయుల క్రైస్తవుల పాలనలో చాలా కష్టాల నెదుర్కొనవలసి వచ్చింది. ధార్మిక క్షేత్రంలో చాలా అవనతికి గురయ్యింది. ఏకేశ్వరోపాసన స్థానంలో అనేక దేవీదేవతల ఉపాసనలు ప్రారంభమయ్యాయి. జాతి అనేక సంప్రదాయములుగా విడిపోయి పరస్పర కలహాలతో అశాంతికి గురి అయ్యింది. అట్టి స్థితి నుండి మన వేదమతాన్ని ఉద్ధరించటానికే మహర్షి దయానంద సరస్వతులవారు ఆర్యసమాజాన్ని స్థాపించి విశుద్ధ వైదిక ధర్మప్రచారం చెయ్యమని ఆదేశించారు. ఆనాటినుండి ఈనాటి వరకు ఆర్యసమాజం హేతుబద్ధమైన విజ్ఞాన సమ్మతమైన వేద సిద్ధాంతాలను ప్రచారం చేస్తున్నది. భవిష్యత్తులో కూడా ఇట్లే చేస్తూ ఉంటుంది. అస్తు.

వైదిక పర్వ పద్ధతి

ప్రపంచమునగల నెల్లదేశవాసులు సంవత్సరమున కొన్ని నియత దినములను పండుగలుగా నెంచి యాదినములందు ఆనందోత్సాహములతో సమయము గడుపుదురు. భారతదేశవాసులైన ఆర్యులును అట్లే కొన్ని దినములను పండుగలుగా నెంచి ఆ దినములందు ప్రతిదినము చేయు సామాన్య కార్యకలాపములు విడిచి విలక్షణముగ ఆనందోత్సాహములతో కాలము గడుపుదురు. గృహాదులను శుద్ధము చేసి, ద్వారములను పచ్చతోరణములతోను, పూలదండలతోను అలంకరింతురు. నూతన లేక శుద్ధ వస్త్రములను ధరింతురు. భోజ్య పదార్థములను విశిష్టరూపమున సిద్ధము చేసికొని భుజింతురు.

కొన్ని పండుగలు కాల, ఋతు పరివర్తనమునకు చెందినవిగాను, కొన్ని మహాపురుషులకు సంబంధించినవిగాను ఉండును.

వైదికులయిన ఆర్యులు ఆ పండుగ దినములలో నిత్యకర్మలయిన పంచ మహాయజ్ఞముల యథాశక్తి నాచరించుచు, అగ్నిహోత్రము చేయుచున్నప్పుడు, అందు ఆయా పర్వదినములకు సంబంధించిన విధి ననుసరించి విశేషాహుతులను

కూడ నిచ్చి పండుగ విధిని గూడ నిర్వర్తింతురు. అట్టివారికి పర్వ పద్ధతి - పంగుల విధానము ఉపకరించును. అదియే ఈ పుస్తక ప్రచురణకు ముఖ్య ప్రయోజనము.

నూతన సంవత్సరోత్సవము (యుగాది)

మేష సంక్రాంతి - చైత్ర శు. 1 పాడ్యమి

యుగాది - సంవత్సరాది పర్వము

విశేషాహుతుల మంత్రములు

ఓం సంవత్సరో౾సి పరివత్సరో౾సీదా
వత్సరోసీద్వత్సరోసి వత్సరోసి ।
ఉషసస్తే కల్పన్తా మహోరాత్రస్తే కల్పన్తా
మర్ధమాసాస్తే కల్పన్తాం మాసాస్తే కల్పన్తామ్
ఋతవస్తే కల్పన్తాగ్ం సంవత్సరస్తే కల్పతామ్ ।
ప్రేత్యా ఏత్యై సఞ్చాఞ్చ ప్ర చ సారయ । సుపర్ణ
చిదసి తయా దేవతాయజ్గిరస్వద్ ధ్రువః సీద ॥స్వాహా॥

(యజు. 27-45)

ఓం యమాయ యమసూమథర్వభ్యో౾
వతోకాగ్ం సంవత్సరాయ పర్యాయిణీం
పరివత్సరాయా విజాతామిదా
వత్సరాయాతీత్వరీమ్ ఇద్వత్సరాయా
తిష్కద్వరీం వత్సరాయ విజర్జరాగ్ం
సంవత్సరాయ పలిక్నీ మృభుభ్యో౾
జినసన్ధగ్ం సాధ్యేభ్యశ్చర్మమ్నమ్ ॥స్వాహా॥ (యజు. 30-15)

ఓం ద్వాదశ ప్రధయశ్చక్రమేకం
త్రీణి నభ్యాని క ఉ తచ్చికేత ।
తస్మిన్సాకం త్రిశతా న శంకవోర్పితాః
షష్టిర్న చలాచలాసః ॥స్వాహా॥ (ఋ. 1-164-48)

ఓం సప్తయుఞ్జన్తి రథమేకచక్రమేకో

అశ్వోవహతి సప్తనామా । త్రినాభి చక్రమజర మనర్వం
యత్రేమా విశ్వా భువనాధితస్థుః ॥స్వాహా॥ (ఋ. 1-164-2)

ఓం ద్వాదశారం నహి తజ్జరాయవర్వర్తి చక్రం
పరిద్యామృతస్య । ఆపుత్రా అగ్నే మిథునాసో
అత్ర సప్తశతాని వింశతిశ్చ తస్థుః ॥స్వాహా॥ (ఋ. 1-164-11)

ఓం పంచపాదం పితరం ద్వాదశాకృతిందివ ఆహుః
పరే అర్ధే పురీషిణమ్ । అథేమే అన్య ఉపరే
విచక్షణం సప్తచక్రే షళర ఆహురర్పితమ్ ॥స్వాహా॥

(ఋ. 1-164-12)

ఓం పంచారే చక్రే పరివర్తమానే తస్మిన్నా
తస్థుర్భువనాని విశ్వా । తస్య నా క్షస్తప్యతే
భూరిభారః సనాదేవ న శీర్యతే సనాభిః ॥స్వాహా॥

(ఋ. 1-164-13)

ఓం సనేమి చక్రమజరం వివావృత ఉత్తానాయం
దశ యుక్తా వహన్తి । సూర్యస్య చక్షూ రజసైత్యావృతం
తస్మిన్నార్పితా భువనాని విశ్వా ॥స్వాహా॥ (ఋ. 1-164-14)

ఓం సంవత్సరస్య ప్రతిమాం యాం త్వా రాత్ర్యుపాస్మ హే ।
సా న ఆయుష్మతీం ప్రజాం
రాయస్పోషేణ సంసృజ ॥స్వాహా॥ (అథ. 3-10-3)

ఓం యస్మాన్మాసా నిర్మితాః త్రింశదరాః
సంవత్సరో యస్మాన్నిర్మితో ద్వాదశారః ।
అహోరాత్రా యం పరియన్తో నాపుస్తే
నౌదనేనాతి తరాణి మృత్యమ్ ॥స్వాహా॥ (అథ. 4-35-4)

మీ అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు.